క్లుప్తంగా

రికార్డుల పరిశీలన



విద్యార్థులతో మాట్లాడుతున్న సెక్టోరియల్ అధికారులు

కురుపాం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలను సెక్టోరియల్ అధికారులు ఏపీఓ హరిప్రసాద్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ చొక్కాపు శ్రీనివాసరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల దినచర్య డైరీని, లెసన్ ప్లాన్స్, విద్యార్థుల హాజరు, సిలబస్ ఎంత వరకు పూర్తయింది తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

పాఠశాలల పర్యవేక్షణకు స్పెషలాఫీసర్లు

సీతంపేట: మరికొద్ది రోజుల్లో పదో తరగతి వార్షిక పరీక్షలు ఉన్నందున జిల్లాలోని ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు తరగతుల నిర్వహణను పర్యవేక్షించేందుకు స్పెషలాఫీసర్లను నియమిస్తూ జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఐటీడీఏ పీఓలు, డీడీలు, ఏటీడబ్ల్యూఓ, ఎంపీడీఓ, తహసీల్దార్, ఐసీడీఎస్ పీఓలు, ఇంజినీరింగ్ అధికారులు, అటవీశాఖ, జీసీసీ అధికారులను స్పెషలాఫీసర్లుగా నియమించారు. జెడ్పీ, సోషల్ వెల్ఫేర్, బీసీ, ట్రైబల్ వెల్ఫేర్ తదితర మేనేజ్‌మెంట్ పరిధిలో ఉన్న 178 హైస్కూల్స్‌లో విద్యార్థుల చదువులను వీరు పర్యవేక్షిస్తారు. పదో తరగతిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు అవసరమైన సలహాలు, సూచనలను సబ్జెక్టు టీచర్లు, విద్యార్థులకు అందిస్తారు.

బావుల ఆక్రమణపై విచారణ



సతివాడలో బావుల ఆక్రమణలపై ఆరా తీస్తున్న డీఎల్‌పీఓ

భామిని: మండలంలోని సతివాడ, కొరమ గ్రామాల్లో పాలకొండ డీఎల్‌పీఓ జె.రామప్రసాదరావు మంగళవారం పర్యటించారు. ఇటీవల జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్పందనలో తాగునీటి బావుల ఆక్రమణలపై పవులురు గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. ప్రస్తుతం తాగునీటి కోసం బావులను వినియోగించకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పంచాయతీ పరిధిలోని బావులను ఆక్రమణకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ నిధులతో వాటిని బాగు చేయించాలని సిబ్బందికి ఆదేశించారు. ఆయన వెంట కోసలి కార్యదర్శి ఎం.మహేంద్రకుమార్, జి.భవానీశంకర్, వీఆర్‌ఓలు పి.వినోద్‌కుమార్, లక్ష్మీనారాయణ, వీఆర్‌ఏలు ఉన్నారు.

ఆధార్ కేంద్రం పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న డీఎల్‌డీఓ

సీతంపేట: స్థానిక కేజీబీవీలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్ కార్యాలయాన్ని డీఎల్‌డీఓ గోపాలకృష్ణ మంగళవారం సందర్శించారు. ఇప్పటి వరకు ఎన్ని ఆధార్ కార్డులు అప్‌డేట్ చేశారని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. ఆధార్ అప్‌డేషన్‌ను వేగవంతం చేయాలని సూచించారు. ఎంపీడీఓ కె.గీతాంజలి ఉన్నారు.

రాజకీయాల్లో ఆర్యవైశ్యులకు స్థానం

పార్వతీపురం టౌన్: రాజకీయాల్లో ఆర్యవైశ్యులకు స్థానం కల్పించింది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని మున్సిపల్ వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేష్ అన్నారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మహేష్ అధ్యక్షతన మంగళవారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మంటపంలో జరిగిన వాసవి క్లబ్ కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయంలో ఆర్యవైశ్యులకు స్థానం కల్పించారని, రాబోయే ఎన్నికల్లో ఆర్యవైశ్యులు ఈ విషయాన్ని గుర్తుంచుకుని వైఎస్సార్‌సీపీని అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ గవర్నర్ ఆత్మకూరు సతీష్, కె.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

సాలూరు: పట్టణంలోని డంపింగ్ యార్డును, మున్సిపల్ రిసోర్స్ పార్క్‌ను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు మంగళవారం పరిశీలించారు. కమిషనర్‌కు పలు ఆదేశాలు జారీ చేశారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా వేయడం, వాటిని ఆదాయ వనరులుగా మార్చడం, ప్రతి ఇంటి నుంచి పూర్తి స్థాయిలో చెత్త సేకరణ తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. ఆయన వెంట కమిషనర్ శంకరరావు తదితరులు ఉన్నారు.

● సబ్‌కలెక్టర్‌కు రైతుల వినతి



సబ్‌కలెక్టర్‌కు తమ సమస్యలు వివరిస్తున్న రైతులు

వీరఘట్టం: రైతుల వద్ద మిగిలి ఉన్న మొత్తం ధాన్యాన్ని మూడు రోజుల్లో కొనుగోలు చేస్తామని సబ్ కలెక్టర్ నూరల్‌కమర్ అన్నారు. నడుకూరు గ్రామ సచివాలయాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన రైతులు ఆయన్ను కలిసి తమ సమస్యలు వివరించారు. గడగమ్మ, కొట్టుగుమ్మడ, కిమ్మి, నడు కూరు, దశుమంతపురం గ్రామాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోయి ఉన్నాయని, తక్షణమే వాటిని కొను గోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. దీనిపై సబ్‌కలెక్టర్ స్పందిస్తూ..ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని, ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆయనతో పాటు తహసీల్దార్ సీహెచ్.సత్యనారాయణ ఉన్నారు.

● మెనూ అమలు తప్పనిసరి



విద్యార్థులు తింటున్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ

గరుగుబిల్లి: ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని ఎంపీడీఓ జి.పైడి తల్లి అన్నారు. మండలంలోని మరుపెంట పంచాయతీ గొల్లవానివలస ప్రాథమిక పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం అమలును మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల హాజరు, స్టాక్ రికార్డులు, భోజనం నాణ్యతను తనిఖీ చేశారు. విద్యార్థులకు మంచి పౌష్టికాహారం అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గోరుముద్ద పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని, లేదంటే తగిన చర్యలు ఉంటాయన్నారు. ఆయన వెంట ఎంఈఓ ఎస్.నాగభూషణరావు ఉన్నారు.

● గురుకులంలో కంటి వెలుగు



విద్యార్థులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

భామిని: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులకు మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కొత్తూరు పీహెచ్‌సీ కంటి వైద్యుడు ఐ.జానకిరామయ్య ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది పాఠశాలలోని సుమారు 460 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. 29 మంది దృష్టి లోపంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారికి త్వరలో ఉచితంగా కళ్లద్దాలు అందజేయనున్నట్లు చెప్పారు. ప్రిన్సిపాల్ కె.విజయనిర్మల, ఆరోగ్య సిబ్బంది మౌనిక, నాగలక్ష్మి, గురుకులం ఏఎన్ఎం రాధ, తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా 'ఉపాధి' పనులు



గుమ్మలక్ష్మీపురం: రేగిడిలో ఉపాధిహామీ వేతనదారులకు సూచనలు చేస్తున్న పీడీ రామచంద్రరావు



జియ్యమ్మవలస: గవరమ్మపేట వద్ద ఉపాధి మస్తర్లు పరిశీలిస్తున్న ఏపీఓ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం: గ్రామాల్లో ఉపాధిహామీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. మండలంలోని రేగిడి గ్రామంలో ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న అబ్జర్వేషన్ ట్రెంచ్ పనులను జిల్లా నీటి యాజమాన్య సంస్థ పీడీ రామచంద్రరావు మంగళవారం పరిశీలించారు. జాబ్‌కార్డులో పేర్లు ఉన్నవారు మాత్రమే పనికి హాజరుకావాలని, పేర్లు లేనివారు జాబ్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. నిబంధనల మేరకు పనులు చేపట్టినట్లయితే గిట్టుబాటు వేతనం లభిస్తుందన్నారు. అనంతరం ఆయన దుడ్డుఖల్లు గ్రామ సచివాలయాన్ని సందర్శించి, ఉద్యోగుల హాజరు, పనితీరుపై ఆరా తీశారు. ఆయన వెంట ఏపీఓ డి.శివరామకృష్ణ, జేఈ మనోజ్‌కుమార్ తదితరులున్నారు.



సీతంపేట: ఉపాధి కొలతలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ



పాలకొండ రూరల్: అట్టలిలో ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ త్రినాథులు

పనికి హాజరైతేనే మస్తరు

జియ్యమ్మవలస: ఉపాధి పనికి వచ్చేవారికి మాత్రమే మస్తర్లు వేయాలని, పనులకు రానివారికి మస్తర్లు వేస్తే కఠిన చర్యలు తప్పవని ఏపీఓ శ్రీనివాసరావు హెచ్చరించారు. గవరమ్మపేట పంచాయతీ వెంకటరాజపురం, గవరమ్మపేటలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. మస్తర్లను తనిఖీ చేసి వేతనదారుల సంఖ్యను లెక్కించారు. పనులకు రాకపోయినా మస్తర్లు నింపుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అటువంటి వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పూర్తి పనిదినాలు కల్పించాలి

పాలకొండ రూరల్: జాబ్‌కార్డు ఉన్నవారికి వంద శాతం పని దినాలు కల్పించాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. మండలంలోని వెలగవాడ, పరశురాంపురం, సింగన్నవలస, వాటపాగు, అట్టలి తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం పరిశీలించారు. రెండు పూటలా పనులు చేయాలని, ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేపట్టాలని సూచించారు. అనంతరం ఆయా గ్రామాల్లోని సచివాలయాలను సందర్శించారు. రికార్డులు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలందించాలని, రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

కొలతల ప్రకారం పనులు చేయాలి

సీతంపేట: కొలతల ప్రకారం పనులు చేయాలని, అప్పుడే గిట్టుబాటు వేతనం లభిస్తుందని ఎంపీడీఓ కోసూరు గీతాంజలి అన్నారు. లక్కాయిగూడలో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పనిలో పాల్గొన్న వేతనదారుల సంఖ్య, నమోదు చేసిన మస్తర్లను పరిశీలించారు.

హెపటైటిస్ బి పట్ల అవగాహన కల్పించాలి

● కలెక్టర్ నిషాంత్‌కుమార్



పోస్టర్‌ను విడుదల చేసిన కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితరులు

పార్వతీపురం: హెపటైటిస్ బి పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం హెపటైటిస్ బి పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.జగన్నాథరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారిణి డాక్టర్ బి.వాగ్దేవి, ఆర్‌బీఎస్‌కే పీఓ డాక్టర్ ధవళ భాస్కరరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు డాక్టర్ పార్వతి, డాక్టర్ వెంకటరమణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి.జగన్‌మోహన్ రావు, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, సీతంపేట ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

భామిని: ఏనుగుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన ట్రాకర్ లక్ష్మీనారాయణ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎం.తిరుపతిరావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని కోరారు. అలాగే ఇటీవల ఏనుగుల దాడిలో మృతి చెందిన రైతు గోపిశెట్టి చిన్నారావు కుటుంబాన్ని ఆదుకోవాలని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. గజరాజులను ఈ ప్రాంతం నుంచి తరలించాలని కోరారు. ఆయనతో పాటు పార్టీ మండల కార్యదర్శి గొర్లె జగన్నాయకులు, కొప్పర మిన్నారావు ఉన్నారు.

మండలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి అభిలాష్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ పీహెచ్‌సీ పరిధి మండ గ్రామంలోని డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌లో మంగళవారం వైద్యాధికారి పైల అభిలాష్, 104 అంబులెన్స్ వైద్యాధికారి జి.ప్రభాకరరావు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. విజయనగరం వెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆప్తాలమిక్ అసిస్టెంట్ బి.శంకరరావు సుమారు వంద మందికి కంటి పరీక్షలు చేశారు. వారిలో 19 మందికి శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ నిమ్మక హైమావతి మాట్లాడుతూ.. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం సంతోషదాయకమన్నారు. శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ మౌనిక, వైద్య సిబ్బంది ఎస్.రత్నప్రసాద్, కాంచన, సుజాత, నాగమణ, అల్లమ్మి, సత్యవతి సేవలందించారు.

కొండాపురంలో 'ఫ్యామిలీ డాక్టర్'



వైద్య సేవలందిస్తున్న డాక్టర్ వెన్నెల

పాలకొండ: మండలంలోని కొండాపురం గ్రామంలో మంగళవారం 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి వెన్నెల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది గ్రామంలో 120 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారిని గుర్తించి వైద్య సేవలందించారు. ఎంఎల్‌హెచ్‌పీ ఎస్.దేవి, ఏఎన్ఎం కుమారి, పీహెచ్‌సీ సిబ్బంది ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉచిత ఉపకరణాల కోసం ఎంపిక



భవిత కేంద్రంలో అందిస్తున్న సేవలను వివరిస్తున్న సిబ్బంది

కురుపాం: మండల కేంద్రంలోని భవిత కేంద్రం ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉచిత ఉపకరణాల కోసం ఎంపిక శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఎస్.సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు భవిత కేంద్రంలో విద్య, ఫిజియోథెరపీ చికిత్స అందిస్తున్నామని, ఈ సేవలను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరానికి 65 మంది హాజరుకాగా.. 52 మందిని ఉపకరణాల కోసం ఎంపిక చేసినట్లు జిల్లా కోఆర్డినేటర్ పి.భానుమూర్తి తెలిపారు.

రెండు ఆటోలు సీజ్



వాహన తనిఖీలు చేస్తున్న ఎస్సై శివప్రసాద్

పాలకొండ రూరల్: నిబంధనలు అతిక్రమించే వాహనదారులపై చర్యలు తప్పవని ఎస్సై బి.శివప్రసాద్ అన్నారు. పట్టణంలోని సీతంపేట, విశాఖ, వీరఘట్టం రహదారుల్లో మంగళవారం వాహన తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణిస్తున్న వాహనదారులపై అపరాధ రుసుం విధించారు. అధిక లోడుతో వెళ్తున్న రెండు ఆటోలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు.

హెల్మెట్ తప్పనిసరి

గుమ్మలక్ష్మీపురం: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎల్విన్‌పేట సీఐ సత్యనారాయణ అన్నారు. రోడ్డుభద్రత నిబంధనలపై సిబ్బందితో కలిసి మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎల్విన్‌పేట జంక్షన్ వద్ద హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనచోదకులకు స్వీట్లు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, రోడ్డుభద్రత నిబంధనలు పాటించాలని కోరారు. ఎస్సై షణ్ముఖరావు, గుమ్మలక్ష్మీపురం సర్పంచ్ బొత్తాడ గౌరీశంకరరావు తదితరులున్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి గాయాలు

పాలకొండ రూరల్: నక్కలపేటలో భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికుడు ప్రమాదవశాత్తు భవనం పైనుంచి జారి పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. రేగిడి మండలం మజ్జిరాముడుపేటకు చెందిన వెంకటరమణ మంగళవారం శ్లాబుపై ఉన్న వ్యర్థాలను తొలగిస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

పిల్లలకు సకాలంలో టీకాలు వేయించాలి



మాట్లాడుతున్న జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు

సీతానగరం: వైద్యాధికారుల పర్యవేక్షణలో చిన్నారులకు ఆరోగ్య సిబ్బంది సకాలంలో వ్యాధినిరోధక టీకాలు వేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ (డీఐఓ) టి.జగన్మోహనరావు అన్నారు. స్థానిక ఆర్‌సీహెచ్‌లో మంగళవారం ఆశా డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ టి.జగన్మోహనరావు వివిధ ఆరోగ్య కార్యక్రమాలపై ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఆశావర్కర్లకు ఇచ్చిన మొబైల్ (ఈ ఆశా యాప్)ను వినియోగించి క్షేత్రస్థాయిలో చేపట్టే ఆరోగ్య కార్యక్రమాలను నిక్షిప్తం చేయాలని కోరారు. ముఖ్యమంగా హై రిస్క్ గర్భిణులు, నవజాత గృహాల సందర్శన ఎప్పటికప్పుడు చేయాలని సూచించారు. ఆశ కార్యకర్తలకు ఇచ్చిన కిట్‌లను వినియోగించి ఆరోగ్య లక్షణాలను గుర్తించిన వైద్యాధికారులకు నివేదిక సమర్పించాలని కోరారు. కార్యక్రమంలో డీఎంఓ యోగీశ్వరరావు రెడ్డి, సూపరువైజర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ సర్వే ప్రారంభం

కురుపాం: నియోజకవర్గంలో తోటపల్లి నుంచి కురుపాం మండల కేంద్రం వరకు సుమారు 14 కిలోమీటర్ల మేర రహదారి విస్తరణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఆర్‌అండ్‌బీ స్థలంలో ఆక్రమణల తొలగింపునకు సర్వే చేపట్టినట్లు ఆర్‌అండ్‌బీ డీఈఈ ఎం.నాగమోహనరావు తెలిపారు. సోమవారం కురుపాం మండల కేంద్రంలోని ధూళికేశ్వరస్వామి ఆలయం నుంచి బస్టాండ్ కూడలి వరకు సర్వే చేశారు. వ్యాపారులు ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమంగా చేపట్టిన నిర్మాణాలను నెలాఖరులోగా స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేదంటే మార్చి నెల మొదటి వారం నుంచి తామే ఆక్రమణలు తొలగిస్తామన్నారు. రహదారి విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.



రోడ్డు విస్తరణకు సర్వే చేస్తున్న ఆర్‌అండ్‌బీ డీఈఈ నాగమోహనరావు, సిబ్బంది

బాలికలు చదువుల్లో రాణించాలి



కేజీబీవీలో ఆహార నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

కురుపాం: బాలికలకు ప్రభుత్వం అనేక వసతులను కల్పిస్తోందని, విద్యార్థినులు వాటిని సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని ఎఫ్ఏఓ కర్రి జోగినాయుడు, ఏజీసీడీఓ రోజారమణి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ, ఏపీ ఆదర్శ పాఠశాలలను మంగళవారం వారు సందర్శించారు. కేజీబీవీలో ఇటీవల చేపట్టిన నాడు-నేడు పనులకు సంబంధించిన రికార్డులు, పాఠశాల నిర్వహణ రికార్డులు, నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. వారి వెంట ఎస్ఓ కిరణ్‌కుమారి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

ఆటో కార్మికుల నిరసన



నిరసన తెలియజేస్తున్న ఆటో కార్మికులు

పాలకొండ: కార్మికుల పట్ల కేంద్రం వ్యవహరిస్తున్న తీరుపై కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు పిలుపునిచ్చారు. ఆటో అండ్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదుట మంగళవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఇన్సూరెన్స్ సంస్థలు వాహన ఇన్సూరెన్స్‌ను 20 శాతం పెంచుకునేలా రవాణ చట్టంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన సవరణకు వ్యతిరేకంగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నామని, ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల ప్రతినిధులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆటో యూనియన్ నాయకులు కె.రాము, కె.సూర్యం, కె.శ్రీనివాసరావు, డి.పాపారావు పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం



బస్సు వెనుక భాగంలో దూసుకెళ్లిన ద్విచక్రవాహనం

సీతంపేట: మండలంలోని కుశిమి గ్రామ సమీపంలో మంగళవారం ఆగి ఉన్న ఆర్టీసీ బస్సును ద్విచక్ర వాహనం వెనుక నుంచి బలంగా ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. పాలకొండ నుంచి శంబాంకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులను దించేందుకు కుశిమి వద్ద ఆగింది. ఆ సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ద్విచక్రవాహన చోదకుడు బస్సును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది.

ట్రాక్టర్ బోల్తా..

మల్లి గ్రామ సమీపంలోని జంక్షన్ వద్ద ట్రాక్టర్ అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న పొలంలో బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. డ్రైవర్ నిర్లక్ష్యంగా నడపడంతోనే ట్రాక్టర్ బోల్తా పడిందని, దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై నీలకంఠం తెలిపారు.